ఉగ్ర దాడులపై వెల్లువెత్తిన నిరసనలు

- కొవ్వొత్తులు చేతపట్టి ర్యాలీ..
- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, తన్నీరు, సంఘాలు


నందిగామలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు


పేటలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు, పార్టీ నేతలు

నందిగామ టౌన్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకలు పాశవికంగా జరిపిన కాల్పుల్లో 26 మంది మృతి చెందటం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ఉగ్రదాడికి నిరసనగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం రాత్రి ఆయన పార్టీ కార్యాలయం నుంచి గాంధీ సెంటరు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముందుగా మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ పిరికి పందల్లా దొంగచాటుగా అభంశుభం తెలియని పర్యాటకులపై దాడి చేయటం హేయమైన చర్యన్నారు. ఉగ్రమూకల చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ముష్కరుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని జగన్‌మోహనరావు కోరారు. పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, మార్త శ్రీను, పీఎల్ నరసింహారావు, చాగంటి రవికిరణ్ రెడ్డి, పట్టా శ్రీను, ఉలవలపూడి నరేంద్ర, షేక్ జాఫర్, మాడుగుల మనోహర్, షేక్ మున్నా, నల్లమల్లి మురళి, పరిశ మల్లికార్జునరావు, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం..

పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ బీజేపీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిరసన చేపట్టారు. స్థానిక గాంధీ సెంటరులో పాకిస్తాన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేసి ఉగ్రమూకల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎదురుగా వచ్చి యుద్ధం చేయలేక దొంగచాటుగా అమాయకులపై కాల్పులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడాన్ని నిరశిస్తూ పట్టణంలోని పలు పార్టీలు, సంఘాల నాయకులు, ప్రతినిధులు బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు స్థానిక రైతుబజారు కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఉగ్రదాడిని ఖండిస్తూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల వైఖరికి నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

హిందూచైతన్య వేదిక ఆధ్వర్యంలో..

కాశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక హిందూ చైతన్య వేదిక జగ్గయ్యపేట శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సంఘటనను హిందూ సమాజం, భారతీయ పౌరులంతా ఖండిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురాం, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, నగర అధ్యక్షుడు సంకా భాస్కర్ పాల్గొన్నారు.


నందిగామ గాంధీ సెంటరులో ఉగ్రమూకల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ, హిందూ సంఘాలు


పేటలో కొవ్వొత్తుల ర్యాలీ

క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేత



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 19వ తేదీన జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య నిపుణులు సూచించిన మేరకు 32 మంది బాలికలకు కళ్లజోళ్లను రిఫర్ చేశారు. కాగా బుధవారం జయప్రద పౌండేషన్ తరపున వారి ప్రతినిధులు నెట్టెం శివరామ్, వైవీఎస్. రెడ్డి, కట్టా నరసింహారావు గురుకుల పాఠశాలకు వచ్చి బాలికలకు కళ్లజోళ్లను అందజేశారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ సుజాత మాట్లాడుతూ అడిగిన వెంటనే కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి పిల్లలందరికి ఉచిత వైద్య సేవలు, కళ్లజోళ్లు అందజే యడంతో పాటు డెంటల్, జనరల్ మెడికల్ క్యాంపు పెట్టి మందులు అందజేసిన జయప్రద ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అస్వస్థతతో 'ఉపాధి' కూలీ మృతి


మృతి చెందిన ఆశీర్వాదం

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): అస్వస్థతతో ఉపాధి హామీ పథకం కింద పనిచేసస్తున్న కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ముచ్చింతాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుజ్జర్లపూడి ఆశీర్వాదం (64)ఈనెల 19 ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి అస్వస్థకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఆరోగ్యం మరింత విషమించటంతో విజయవాడ వెళ్తా మార్గమధ్యంలో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు తెలిపారని కుటుంబ సభ్యులు వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

నందిగామ రూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం కానుకల హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో హరిగోపీనాథ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ నిబంధనల మేరకు ఉదయం 10 గంటల నుంచి హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

మొక్కజొన్న పొలాలు దగ్ధం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పొలాలు దగ్ధమైన ఘటన మండలంలోని కొటికలపూడి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామంలోని 15 మంది రైతులకు చెందిన సుమారు 25 ఎకరాల మొక్కజొన్న పైరు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. పొలాల్లో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే పంటపొలాలు దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు వేసవిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తగిన జాగ్రత్తలు చేపట్టక పోవడంతో ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. రైతుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు పంట నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు శ్రేయస్కరం



వీరులపాడు: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం శ్రేయస్కరమని జిల్లా వైద్యాధికారి సుహాసిని పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు జరిగేలా వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్యులు, సిబ్బంది పని తీరు కనబర్చాలని తెలిపారు. సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య సేవలు పొందేలా, పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారి రవికిరణ్ రెడ్డి, ఎంపీహెచ్‌వో చంద్రశేఖర్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు


కే ఇందు (566)


హసీనా (560)


సాహితి (557)


రిజ్వానా (575)


శ్రీకాంత్‌రెడ్డి(568)


ఉదయ్‌కుమార్ (567)


నవతేజ (594)


లక్ష్మణ్ నాయక్ (594)


స్నేహిత (593)


రాధాకృష్ణ (593)

ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ

పెనుగంచిప్రోలు: విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని 7 ప్రభుత్వ పాఠశాలల్లో 66.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవీంద్ర తెలిపారు. మండలంలో ఈఏడాది మొత్తం 260 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 172 మంది ఉత్తీర్ణత సాధించగా 88 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారన్నారు. మండలంలో 600 మార్కులకు గాను 566 మార్కులతో పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొరడాల ఇందు ప్రథమ స్థానం, సాధించగా కొణకంచి ఎస్ఆర్ఎస్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన షేక్ హసీనా 560 మార్కులతో ద్వితీయ స్థానం, కనగాల సాహితి 557 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.

విద్యార్థులకు అభినందన...

కొణకంచి(పెనుగంచిప్రోలు): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ఎం.రమణ, ఉపాధ్యాయులు అభినందించారు. 600 మార్కులకు గాను 560 మార్కులు సాధించిన షేక్ హసీనా, 557 మార్కులు సాధించిన కనగాల సాహితిని స్వీట్లు, బొకేలతో అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని హెచ్‌ఎం అన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో..

పెనుగంచిప్రోలు శ్రీచైతన్య టెక్నోస్కూల్‌లో 106 మంది విద్యార్థులకు 97 మంది ఉత్తీర్ణత సాధించగా కనపర్తి వేద అమృత అత్యధికంగా 593 మార్కులు సాధించింది. అనిగండ్లపాడు శ్రీచైతన్య హైస్కూల్‌లో 43 మంది విద్యార్థులకు 36 మంది ఉత్తీర్ణత సాధించగా బి.మౌనిక 585 మార్కులు సాధించింది. నవాబుపేట విశ్వవాణి విద్యాలయంలో 31 మందికి 29 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా అధికంగా టి.వైష్ణవి 521 మార్కులు సాధించింది.

మండలంలో 64.04 శాతం ఉత్తీర్ణత..

నందిగామ టౌన్: పట్టణం, మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో 64.04 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 678 మంది పరీక్షకు హాజరవగా 438 మంది ఉత్తీర్ణులయ్యారని, 240 మంది ఫెయిలైనట్లు తెలిపారు. నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కందుల తేజస్వీ 569 మార్కులు సాధించగా ప్రజాపతి అంజలి 556, అరిగెల హర్షిత 554, కొణతమాత్మూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన లంక వాసు 565, రాచకొండ నీలిమ 560, కొంకపాక ధనుష్ 555 అత్యధిక మార్కులు సాధించినట్లు చెప్పారు.


సభనమ్ (590)


గణేష్ రెడ్డి (573)

వత్సవాయి మండలంలో 76 శాతం ఉత్తీర్ణత

వత్సవాయి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో 76 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నాగరాజు తెలిపారు. మండలంలో ఈఏడాది మొత్తం 508 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 387 మంది ఉత్తీర్ణత సాధించగా 121 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారన్నారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో వత్సవాయి జెడ్పీ పాఠశాలకు చెందిన షేక్ రిజ్వానా 575 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించగా, భీమవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.శ్రీకాంత్‌రెడ్డి 568 మార్కులతో ద్వితీయ స్థానంలో, వత్సవాయి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.ఉదయ్‌కుమార్ 567 మార్కులతో తృతీయ స్థానం సాధించాడు.

నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ

జగ్గయ్యపేట: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని తపోవన్ విద్యాలయం విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో 594 మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరిచారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఆర్.నవతేజ, జి.లక్ష్మణ్ నాయక్‌లు 600 మార్కులకు 594 మార్కులు సాధించి ప్రథమ స్థానాల్లో నిలిచారు. డి.స్నేహిత, కె.రాధకృష్ణలు 593 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలవగా, 590 మార్కులతో ఎస్‌కే సభనమ్ తృతీయ స్థానంలో సాధించింది. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సుధీర్ విద్యార్థులను అభినందించారు.

సంస్కృతి పాఠశాలలో..

కంచికచర్ల: స్థానిక సంస్కృతి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి తుమ్మేపల్లి దేవహర్షిణికి 600 మార్కులకు 595 మార్కులు వచ్చాయని స్కూల్ కరస్పాండెంట్ రమేష్ తెలిపారు. విజయరాణి ఉన్నత పాఠశాలకు చెందిన తోట గ్రీష్మ 600 మార్కులకు 593 మార్కులు, మాడుగుల వర్షిత 592 మార్కులు, షేక్ సనఆఫ్రిన్ 589 మార్కులు సాధించారని స్కూల్ ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ సిస్టర్ క్రీస్తురాణి తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అత్యుత్తమ ఫలితాలు..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజ్ఞాన్ విద్యా సంస్థలో చదివిన పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు విజ్ఞాన్ విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. 588 మార్కులతో షేక్ రేహాన్, షేక్ ఒమర్ ఫరూక్ స్కూల్ ఫస్ట్ సాధించారని తెలిపారు. 587 మార్కులతో తోట బిందుశ్రీ, పఠాన్ అబ్దుల్ కరీంఖాన్ ద్వితీయ స్థానంలో, 584 మార్కులతో మోరె హారిక, ధనిశెట్టి లక్ష్మీ వెంకటనారాయణ తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. 16 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించారని, 38 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారన్నారు. మొత్తం 87 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 85 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. స్కూల్స్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో 78 శాతం ఉత్తీర్ణత..

వీరులపాడు: మండలంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో పాల్ కెనడీ బుధవారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు 405 మంది హాజరవగా 316 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గూడూరు గణేష్ రెడ్డి 573 మార్కులు సాధించగా జయంతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆజాద్, వినీతలు 565 మార్కులు సాధించారని చెప్పారు.

పేట మండలంలో 79 శాతం ఉత్తీర్ణత..

జగ్గయ్యపేట అర్బన్: పదవ తరగతి పరీక్షా ఫలితాలలో పట్టణం, మండంలోని 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులం, ఎస్టీ వెల్ఫేర్ బాలుర గురుకులం పాఠశాలల్లో 79 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ఎల్.చిట్టిబాబు బుధవారం తెలిపారు. పేట పట్టణం, మండలంలో మొత్తం 804 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, వారిలో 639 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. బలుసుపాడు రోడ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎం.ప్రవల్లిక 577 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం, 576 మార్కులతో బి.రీతిక తృతీయ స్థానంలో నిలిచారు. జగ్గయ్యపేట పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన షేక్ అఫ్రీమ్ 553 మార్కులు, జెడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన జాస్మిన్ 549 మార్కులు, భార్గవ్ 538 మార్కులు, తొర్రగుంటపాలెంలోని జెడ్పీ హైస్కూల్‌లో సయ్యద్ అయేషా 528 మార్కులు సాధించినట్లు తెలిపారు. పేటలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 77 మందికి 74 మంది ఉత్తీర్ణులయ్యారు.96 శాతం ఉత్తీర్ణత సాధించారు.

నందిగామ డివిజన్‌లో 82.44 శాతం ఉత్తీర్ణత


ఎన్‌కే వెంకట నాగశ్రీ సాయి (587)


ఎన్‌కే వెంకట నాగశ్రీ (584)

కంచికచర్ల: నందిగామ డివిజన్‌లో కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు, జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో 5,990 మంది పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయగా వారిలో 4,938 మంది ఉత్తీర్ణులయ్యారని, 82.44 శాతం ఉత్తీర్ణత సాధించారని డీవైఈఓ డీ సాంబశివరావు బుధవారం తెలిపారు. కంచికచర్ల మండలంలో 888 మంది పరీక్ష రాయగా 692 మంది ఉత్తీర్ణులయ్యారు. 77.93 శాతం ఉత్తీర్ణత సాధించారు. నందిగామ మండలంలో 1,522 మందికి గానూ 1,239 మంది ఉత్తీర్ణులవ్వగా 81,41 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరులపాడు మండలంలో 405కు 315 మంది పాస్ అవ్వగా 77.78 శాతం ఉత్తీర్ణత సాధించారు. చందర్లపాడు మండలంలో 607 మందికి 566 మంది పాస్ అవగా 93.25 శాతం ఉత్తీర్ణులయ్యారు. జగ్గయ్యపేట మండలంలో 1,594 మందికి 1,390 మంది పాస్ అవగా 87.20 శాతం ఉత్తీర్ణులయ్యారు, వత్సవాయి మండలంలో 508 మందికి గానూ 384 మంది పాస్ అవగా 75.59 ఉత్తీర్ణత సాధించారు. పెనుగంచిప్రోలు మండలంలో 466 మందికి 352 మంది పాస్ అవగా 75.54 ఉత్తీర్ణత సాధించారు.

నందిగామ నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో టాప్-5లో ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారని డీవైఈఓ తెలిపారు. వారిలో టాప్-1లో కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నందికట్ల కుందన వెంకట నాగశ్రీ సాయి 600 మార్కులకు 587 మార్కులు సాధించి నియోజకవర్గంలో మొదటిస్థానం దక్కించుకున్నాడు. అదే పాఠశాలకు చెందిన నందికట్ల కుందన వెంకట నాగశ్రీ 584 మార్కులు సాధించి టాప్- 2లో నిలిచారు. వీరిద్దరు అన్నా చెల్లెళ్లు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గురుకులపాఠశాల విద్యార్థి సీహెచ్ యశస్విని 583 మార్కులు సాధించి టాప్- 3లో నిలిచారు. తోటరావులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పీ అనూష 577 మార్కులు సాధించి టాప్- 4లో నిలిచారు. వీరులపాడు మండలం అల్లూరు జెడ్పీ స్కూల్ విద్యార్థి గూడూరు గణేష్‌రెడ్డి 573 మార్కులు సాధించి టాప్- 5లో నిలిచారని డీవైఈఓ సాంబశివరావు తెలిపారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

చాట్రాయి: మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం అన్నారు. మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఉపాధి కూలీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఎండల్లో పని చేస్తుంటే కనీసం సేద తీర్చుకునేందుకు నీడ కల్పించలేకపోతున్నారని, పని ప్రదేశంలో టెంటు ఏర్పాటు చేయాలని, వారం వారం వేతనాలు చెల్లించాలని కోరారు.

శోభాయమానంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం


కల్యాణ క్రతువులు జరిపిస్తున్న దంపతులు


కల్యాణ ఉత్సవమూర్తులు

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలుమంగ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం సుప్రభాత సేవ, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, తదితర కార్యక్రమాలను అర్చకుడు పరాశరం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సహిత సుదర్శన హోమాన్ని వేదోక్తంగా జరిపించారు. రాత్రికి లక్ష్మీనారాయణ కల్యాణం, మూలవరులకు పుష్పయాగం, ధ్వజావరోహణం, నక్షత్ర హారతి, పూర్ణాహుతి పూజలు, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం రాత్రి పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో వైఖానస సంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణాన్ని శోభాయమానంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీఠలపై కూర్చుని కల్యాణ క్రతవులను జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హనుమేశ్వరరావు, సూరె వెంకట రామారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.